

సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి తదితరులు

## సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌అర్బన్, నవంబర్ 2: ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితోపాటు గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు గురువారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డితోపాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, జడ్పీటీసీ పంగ మల్లేశం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎర్రవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వారిని ఆప్యాయంగా పలకరించారు.

# కారెక్కిన కాంగ్రెస్ నేతలు



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరిక

ములుగు, నవంబర్ 2: కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో గురువారం ములుగు మండల పరిధిలోని బండమైలారం, సింగన్నగూడ, నర్సాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, జడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో చేరారు. గులాబీ కండువాలు కప్పి మంత్రి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ బొల్లెపల్లి బాలకృష్ణ, బీఆర్‌ఎస్ నేత రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజకీయ కార్యకలాపాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 2: రాజకీయ పార్టీలు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించబోయే వివిధ కార్యకలాపాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తెలిపారు. తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గంలో 3, గజ్వేల్‌లో 10 పోలింగ్ స్టేషన్ల పేర్లలో మార్పుల గూర్చి రాజకీయ పార్టీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఓటర్ లిస్ట్‌ను త్వరలో అందిస్తామన్నారు. 'సువిధ' యాప్‌లో ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే నేరుగా నియోజకవర్గ ఆర్‌ఓ అనుమతి కోసం సంప్రదింపులు జరపాలని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో జరిగే రాజకీయ పార్టీల వివిధ కార్యకలాపాలను తప్పనిసరిగా ముందస్తు అనుమతితోనే నిర్వహించాలని సూచించారు. జిల్లాలో దివ్యాంగులు, 80 సంవత్సరాల వయసు గల వారు ఫామ్-12డి ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. సమావేశంలో దుబ్బాక, హుస్నాబాద్ ఆర్వోలు గరిమా అగర్వాల్, బెన్ షాలం, బీఆర్‌ఎస్ ప్రతినిధి జే.మోహన్ లాల్, బీజేపీ ప్రతినిధి బోగి శ్రీనివాస్, ఎంఐఎం ప్రతినిధి ఎండీ మునీర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి జి.మధు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయ కమిటీ సభ్యుల నియామకం

గజ్వేల్, నవంబర్ 2: బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులుగా మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డిలను నియమిస్తున్నట్లు మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం ప్రకటించారు. బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జులుగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలను నియమించగా వారితోపాటు ఇద్దరు మాజీ కార్పొరేషన్ చైర్మన్లను సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి ఫలాలు ప్రజలందరి ముందు కనబడుతున్నాయని, కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. గజ్వేల్ అంటే గులాబీకి పెట్టింది పేరని, తప్పకుండా ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఇప్పటికే చాలా వరకు కులసంఘాల ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానాలు చేసి తమ మద్దతు కేసీఆర్‌కు తప్ప మరెవరికీ ఇవ్వమనే దృఢ నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. సెంటిమెంట్‌గా గజ్వేల్‌లో గెలిచేది కేసీఆర్.. తెలంగాణకు హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆర్ అన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని స్వాగతిస్తూ ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారన్నారు. 2014, 2018లో ప్రజలు మంచి మెజార్టీతో గెలిపించినట్లే ఈసారి కూడా ఎన్నికల్లో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

---

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. 'ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గ కేంద్ర రిటర్నింగ్ అధికారి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాల పూరింపులో ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి తహసీల్ స్థాయి అధికారిని అందుబాటులో ఉంచాం. ఏదైనా ఫిర్యాదు చేయాలంటే 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. నేటి నుంచి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నది'.. అని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. గురువారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన మాట్లాడారు.

- సిద్దిపేట, నవంబర్ 2
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)




# నామినేషన్ల స్వీకరణకు
# అన్ని ఏర్పాట్లు చేశాం

**నమస్తే తెలంగాణ : సిద్దిపేట జిల్లాలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?**

**ఎన్నికల అధికారి :** జిల్లాలో 1,151 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. జిల్లాలో ఉన్న మొత్తం పోలింగ్ బూత్‌లు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు ఉన్న మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం చేయడానికి ఒక సిబ్బందిని కేటాయిస్తున్నాం. జిల్లాలో 80 ఏండ్లకు పైబడిన ఓటర్లుగా ఉన్నవారు, ఫామ్-12 నింపిన వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఉంది. నేటి వరకు 3,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

**నమస్తే తెలంగాణ : అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం ఎంత పట్టుకున్నారు?**

**ఎన్నికల అధికారి :** సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు రూ. 1.72 కోట్ల నగదు, 12 వేల లీటర్ల మద్యం, 300 కిలోల గంజాయితోపాటు ఇతర సామగ్రిని పట్టుకున్నాం. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సామాజిక బాధ్యతగా ఓటు వేయాలని నా సూచన. రాజకీయ పార్టీ ఏదైనా ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేయాలంటే 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలి. సువిధ యాప్‌లో 48 గంటల ముందు కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలి.

**నమస్తే తెలంగాణ :** నేటి నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నందున ఏ విధమైన చర్యలు చేపట్టారు.

**జిల్లా ఎన్నికల అధికారి :** జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల వరకు అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. నామినేషన్ వేయడానికి కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. పోటీచేసే అభ్యర్థులకు అవగాహన కల్పించడానికి ఒక అధికారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 13న స్క్రూటినీ ఉంటుంది. ఈ నెల 15న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ.

- జిల్లాలో నాలుగు నామినేషన్ కేంద్రాలు
- పక్కాగా ఎన్నికల నియమావళి అమలు
- రూ.1.72 కోట్ల నగదు పట్టుకున్నాం
- 12 వేల లీటర్ల మద్యం, 300 కిలోల గంజాయి స్వాధీనం
- 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలి
- సీ విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదులకు అవకాశం
- 'నమస్తే తెలంగాణ'తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**నమస్తే తెలంగాణ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఏర్పాటు చేసిన బృందాలు ఏ విధంగా పని చేస్తున్నాయి?

**ఎన్నికల అధికారి:** జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో పకడ్బందీగా ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికీ 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 3 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లు, 3 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, ఒక వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు ఉన్నాయి. నియోజకవర్గంలో ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగిందని తెలిస్తే ఈ బృందాలు తొందరగా సంఘటనా స్థలానికి వెళ్లి చర్యలు తీసుకుంటాయి. ఇప్పటివరకు జిల్లాలో 80 కేసులు నమోదు చేశాం.

**నమస్తే తెలంగాణ :** ఓటింగ్ శాతం పెరిగేందుకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

**ఎన్నికల అధికారి :** జిల్లాలో ప్రతిసారి ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉంటున్నది. గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో 84శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర స్థాయిలో 73శాతం మాత్రమే నమోదైంది. ఓటింగ్ 86శాతానికి చేర్చాలని ప్రయత్నం చేస్తున్నాం. సిద్దిపేట చాలా చైతన్యవంతమైన జిల్లా. ఎక్కువ మంది స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేస్తారు. జిల్లాలో 82 వేల కొత్త ఓటర్లు నమోదయ్యారు. ఇందులో 18 వేల మంది యువ ఓటర్లు ఉన్నారు. వారు ఎంతో ఉత్సాహంగా ఓటు వేసేందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.



**నమస్తే తెలంగాణ :** ఎన్నికల సందర్భంగా ప్రజలకు మీరిచ్చే సందేశం?

**ఎన్నికల అధికారి :** ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది. ఒక్క ఓటుతో ఏమి జరుగుతుంది అని ఆలోచించకుండా ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలి.